ఆదాయ పెంపుపై దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- రూ.19.81 కోట్లతో హుస్నాబాద్ మున్సిపల్ బడ్జెట్
- సభ్యుల ఏకగ్రీవ ఆమోదం



బడ్జెట్ పద్దులను చూస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

హుస్నాబాద్: పట్టణంలో ఇండ్ల క్రమబద్ధీకరణ చేపట్టి ఆదాయం పెంచుకోవాలని అనంతరం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం 2023–24 మున్సిపల్ అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ హాజరయ్యారు. బడ్జెట్ పద్దుల వివరాలను అకౌంటెంట్ చదివి వినిపించారు. సాధారణ నిధులు, గ్రాంట్ల ద్వారా రూ.19.81 కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సాధారణ వ్యయం రూ.5.60 కోట్లు (పన్నుల ద్వారా, పన్నేతర) బడ్జెట్‌పై పలువురు కౌన్సిలర్లు స్పందించారు. శివారులో వెలసిన వెంచర్ల నుంచి పన్నులు వసూలు చేయాలని కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ కోరారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు న్యాయం చేయాలని కౌన్సిలర్ చిత్తారి పద్మ అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేలో కౌన్సిలర్లను భాగస్వాములు చేయాలని కౌన్సిలర్లు భూక్య సరోజన, వల్లపు రాజు అన్నారు. పట్టణంలోని బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న రెస్టారెంట్ వద్ద చెత్త వేస్తున్నవారిపై చర్య తీసుకోవాలని కౌన్సిలర్ జనగామ రత్నప్రభ దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో కోతులు, పందులు, కుక్కల బెడదను తొలగించాలని కౌన్సిలర్ కోమటి స్వర్ణలత అధికారులను కోరారు.

ఇళ్ల క్రమబద్ధీకరణ చేయాలి

పట్టణ శివారు ప్రాంతాలు పోతారం(ఎస్), గాంధీనగర్, నాగారం వంటి గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసి, ఖాళీ స్థలాల్లో అర్హులకు ఇంటి స్థలం కేటాయించాలన్నారు. జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయని, పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, మల్లెచెట్టు చౌరస్తా, అనబేరి చౌరస్తాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. రూ.35 కోట్లతో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం పూర్తి చేశామని, మరింత మంది పారిశుధ్య కార్మికులను నియమించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ పట్టణంలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేశామని తెలిపారు. సర్వేలో అవకతవకలు జరగలేదని, అనర్హులు ఉన్నట్లు ఆధారాలు చూపితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశమంతా జరగాలి

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి

మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశమంతా జరగాలని, సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను ఏర్పాటు చేసి దేశరాజకీయల్లోకి వెళ్తున్నారని తెలంగాణ ప్రజలంతా ఆయన వెంట నడవాలి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూరు మండలంలోని తాజ్‌గార్డెన్‌లో దూల్మిట మండలాధ్యక్షుడు మంద యాదగిరి అధ్యక్షతన మండలస్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కోటిరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లే బాధ్యత బీఆర్‌ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. పారేనదిని తిరిగి పారించి గోదావరి జలాలతో కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనుడు సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఆడబిడ్డ కవితపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. దేశ సంపదనను దోచుకెళ్లిన అదానీపై కేసులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం, సింగిల్ విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు యాదగిరి, యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు, మహిళ అధ్యక్షురాలు అరుణ, మాజీ జెడ్పీటీసీ పద్మవెంకట్‌గౌడ్, సర్పంచులు, పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


కిష్టాపూర్‌లో విలేజ్ ఫంక్షన్ హాల్ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లెల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కిష్టాపూర్‌లో రూ.30 లక్షలతో నిర్మించే విలేజ్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి, రూ.5 లక్షలతో నిర్మించే జిమ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సహకారంతో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామాల్లో అన్ని కుల సంఘాల భవనాలు నిర్మించుకున్నామన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫంక్షన్ హాల్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

తడి పొడి చెత్తతో ఎరువులు...

ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తతో ఎరువులు తయారు చేయవచ్చని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. కిష్టాపూర్‌లో స్వచ్ఛ భారత్ మిషన్‌పై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలు జరుగుతాయని, ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, సర్పంచ్‌లు కవిత, స్వరూప, నవీన్, బాబు, ఎల్లయ్య, శ్రీనివాస్, జ్యోతి, రాజాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



సిద్దిపేటకమాన్: సిబ్బందిని అభినందిస్తున్న వైద్యాధికారులు

హుస్నాబాద్‌రూరల్: ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మీర్జాపూర్‌లో వైద్య సిబ్బంది ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ నికిత క్షయ వ్యాధి లక్షణాల గురించి గ్రామస్తులకు వివరించారు. ప్రతీ నిమిషానికి గాలి ద్వారా మరొకరికి సోకుతుందని, నిర్మూలన చర్యలు తీసుకుంటే వ్యాధి నుంచి విముక్తి పొంద వచ్చన్నారు. మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ రోజు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నామని, పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సిద్దిపేటకమాన్: క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అజీమొద్దీన్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సిద్దిపేట కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో అత్యుత్తమ సేవలు అందించిన 15 మంది వైద్య సిబ్బందిని ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రజని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయపోల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మహారాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో క్షయ వ్యాధి నిర్మూలనపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి సుగంధలత, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.

వర్గల్(గజ్వేల్): ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం వర్గల్‌లో ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. ర్యాలీలో డాక్టర్ హరిత, డాక్టర్ దీప, హెచ్ఎం వెంకటేశ్వర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని జగదేవ్‌పూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యప్రకాశ్, వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాల్టి పరధిలోని చెల్లాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి వ్యాసరచన పోటీలు తదితక కార్యక్రమాలు నిర్వహించారు.

'బీజేపీ నిరుద్యోగ ధర్నాను జయప్రదం చేద్దాం'


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నేతృత్వంలో ఈనెల 25వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ చౌక్ వద్ద నిర్వహించే బీజేపీ నిరుద్యోగ మహాధర్నాకు నిరుద్యోగులు, మేధావులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో నిందితులను శిక్షించాలన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, వీరాచారి, నాయకులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): ఈనెల 25న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న నిరుద్యోగ మహాధర్నాకు నాయకులు, నిరుద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు దోనె అశోక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాజు, మహేష్, శ్రీనివాస్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు

మద్దూరు(హుస్నాబాద్): మైనార్టీలకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్‌లతో కలిసి, మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉమ్మడి మద్దూరు మండలంలో మైనార్టీ రుణాలకు మూడు యూనిట్‌లకు 93 మంది దరఖాస్తులు చేసుకున్నారు. 79 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు.

ఎంపీకి ఆహ్వానం

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ పోచమ్మ ఆలయం ద్వితీయ వార్షికోత్సవం ఆహ్వాన పత్రికను శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గోనెపల్లి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మాదిగమహారాజ్ సంఘం పెద్దలు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. ఉత్సవాలకు రావాలని ఎంపీని కోరారు.

పన్నుల విషయంలో తప్పుదోవ పట్టించడం సరికాదు

మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వరూపరాణి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ఇంటి పన్నుల విషయంలో పట్టణ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని, పన్ను వసూలు విషయంలో పాలకవర్గం మొదటి నుంచి స్పష్టమైన వైఖరితో ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇంటి పన్నుల వసూలు విషయంలో పాలకవర్గం మొదటి నుంచి స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతోందని, ఒక శాతంగా ఉన్న దానిని 0.25 శాతానికి తగ్గించేలా పాలకవర్గం చేసిందన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఆస్తుల విలువలను పెంచిన కారణంగా పన్నుల భారం పెరిగిందని, దీనిపై స్పందించిన పాలకవర్గం తిరిగి 0.125 శాతానికి తగ్గించేలా తీర్మానం చేశామన్నారు. ఇంటి పన్నులను అసాధారణంగా, అశాస్త్రీయంగా పెంచారని జేఏసీ, అఖిలపక్ష నాయకులు ఆరోపించడం సరికాదన్నారు. పన్నులను తగ్గించాలని ప్రభుత్వానికి పాలకవర్గం నివేదిక సమర్పించిన పరిస్థితుల్లో కొన్ని స్వార్థ శక్తులు తమ ఉనికిని చాటుకోవడానికి ప్రజలను అయోమయానికి గురిచేస్తూ బంద్‌కు పిలుపు నివ్వడం సరికాదన్నారు. ఆమె వెంట వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ బాధ్యులను శిక్షించాలి

విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు


సిద్దిపేటకమాన్: దీక్షను విరమింపజేస్తున్న దృశ్యం

ములుగు(గజ్వేల్): టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ ములుగు మండల అధ్యక్షుడు పల్లె రమేశ్ యాదవ్ అన్నారు. మండలంలోని వంటిమామిడిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీ కేసును సిట్టింగ్ జడ్జితో విచారించడంతో పాటు ఐటీ మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పరీక్ష రాసిన నిరుద్యోగ యువతకు రూ.లక్ష చొప్పున పరిహారం ప్రకటించాలని కోరారు. సమావేశంలో కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి మన్నె శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి తలారి లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి యాదగిరి, బీజేవైఎం మండల అధక్షుడు స్వామి, బూత్ అధ్యక్షుడు రాజు నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: ఎన్నో ఆశలతో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ చెలగాటమాడుతోందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన అంతా అవినీతిమయమైందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించడంతో పాటు దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

సిద్దిపేటకమాన్: పేపర్ లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్ డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల నిరవధిక నిరహార దీక్షను పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను శుక్రవారం విరమింపచేశారు.

టీఎస్‌పీఎస్సీలో ..

పేపర్ లీకేజీలకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాల ఐకాస నేతలు డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీని ఖండిస్తూ సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో పీడీఎస్‌యు, ఎస్‌ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, ఏఐపీఎస్‌యు సంఘాల పిలుపు మేరకు విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం సీఎం శవయాత్రకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు.

సర్పంచ్‌ల సేవలు అభినందనీయం

ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి


కొమురవెల్లి(సిద్దిపేట): గ్రామపంచాయతీలకు పురస్కారాలను అందజేస్తున్న అధికారులు

తొగుట(దుబ్బాక): గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న సర్పంచ్‌ల సేవలకు గుర్తింపు లభించడం అభినందనీయమని ఎంపీపీ లతానరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ పత్రాలను సర్పంచ్‌లు, కార్యదర్శులకు అందజేశారు.

కొండపాక(గజ్వేల్): గ్రామ పంచాయతీల పనితీరుపై ప్రశంసా పత్రాలు అందుకోవడం గొప్ప విషయమని ఎంపీపీ ర్యాగల్ల సుగుణ అన్నారు. దీన్ దయాల్ పంచాయతీ సతత్ పురస్కారాలను మండలంలోని 14 గ్రామ పంచాయితీలకు గాను 27 ప్రశంసా పత్రాలను శుక్రవారం అందజేశారు.

కొమురవెల్లి(సిద్దిపేట): గ్రామపంచాయతీలను అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలపాలని ఎంపీపీ తలారీ కీర్తన అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అనురాధతో కలసి గ్రామ పంచాయతీలకు సతత్‌వికాస్ పురస్కారాలు అందజేశారు.

అవార్డుల పంపిణీలో నిరసన

సతత్‌వికాస్ పురస్కారాల పంపిణీలో మండలంలోని రాంసాగర్, అయినాపూర్ సర్పంచ్‌లు రవీందర్, రమణారెడ్డి నిరసన వ్యక్తం చేశారు. తమకు రావల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని, గ్రామ పంచాయతీలో చేసిన పనులకు బిల్లులు రాక పస్తులుంటున్నామని, అవార్డులతో ఒరిగేది ఏమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ అవార్డులు తీసుకునేందుకు నిరాకరించారు. మండల ప్రత్యేకాధికారి రవికుమార్ పెండింగ్ బిల్లులు వచ్చేలా చూస్తామని తెలపడంతో సర్పంచులు శాంతించారు. కిష్టంపేట సర్పంచ్ బీమనపల్లి కరుణాకర్ మాత్రం ఎంపీవో మంజుల ఏకపక్ష వైఖరికి నిరసనగా అవార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరుకాకపోవడంతో పంచాయతీ కార్యదర్శికి అవార్డు అందజేశారు.

బెజ్జంకి(సిద్దిపేట): సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం బెజ్జంకి రైతు వేదికలో నిర్వహించారు. ఆయన చేతుల మీదుగా సర్పంచ్‌లకు అవార్డులు ప్రదానం చేశారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల నిరసన

హుస్నాబాద్: 2019లో కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నీరవ్ మోడీ, మోడీ పేర్లున్న వారితో దేశం ఇబ్బందులకు గురవుతుందన్నమాటకు గుజరాత్ సూరత్ కోర్టు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి జైలు శిక్ష తీర్పుపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంభిస్తోందన్నారు. ప్రశ్నించే వారిపై ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు.

పట్టణ బంద్ ప్రశాంతం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలో పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని కోరుతూ జేఏసీ, అఖిలపక్షం సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణ కేంద్రంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు పలు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఆర్.పరమేశ్వర్ మాట్లాడారు. బంద్ విజయవంతం కావడానికి సహకరించిన పట్టణ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పన్నుల పెంపుతో పట్టణ ప్రజల్లో ఎంత వ్యతిరేకతఉందో పాలకవర్గం, అధికారులు అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ, అఖిలపక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం జరగకుంటే ..

కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నిరుపేదలైన అర్హులకు డబుల్ బెడ్‌రూమ్‌లలో న్యాయం జరగకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. ఇటీవల ప్రకటించిన జాబితాలో అనర్హులే ఎక్కువగా ఉన్నారని, అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరుతూ పలువురు లబ్ధిదారులతో కలిసి శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ఐఓసీలో ఆర్డీవో విజయేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ తూతూ మంత్రంగా అధికారులు సర్వే చేపట్టి 3వ జాబితాను ప్రకటించడంతో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగిందన్నారు. చనిపోయిన వారితో పాటు 1, 2వ జాబితాలో పేర్లు లేనివారు 3వ జాబితాలో నమోదు కావడం అధికారులు చేపట్టిన సర్వేకు నిదర్శనమన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

వర్గల్(గజ్వేల్): అపార పోషకవిలువలు కలిగిన చిరుధాన్యాలను తీసుకోవడంద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ వర్గల్, మజీద్‌పల్లి సెక్టార్ సూపర్‌వైజర్లు రాణి, సునీత అన్నారు. పోషణ పక్షం కార్యక్రమం పురస్కరించుకుని శుక్రవారం ఆయా సెక్టార్ల పరిధిలోని గౌరారం, సింగాయపల్లి, గోవిందాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిరుధాన్యాలు(మిల్లెట్స్), పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలు, తల్లులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని సీడీపీఓ శారద అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముస్త్యాల హైస్కూల్‌లో ప్రాజెక్టు స్థాయి పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. 150 రకాల చిరుదాన్యాలతో చేసిన పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ సిబ్బంది వెంకటప్రసాద్, రాము, కనకరాజు, ఐటీ కో–ఆర్డినేటర్ చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా పోరాడదాం

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు ఐకమత్యంగా పోరాటం చేద్దామని రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు ఇచ్చింది. శుక్రవారం అంబిటస్ పాఠశాలలో జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఏప్రిల్ 8న సిద్దిపేటలో భారీ బహిరంగ సభ ద్వారా తమ సత్తా చాటాలని నిర్ణయించారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటజోన్: నిరుద్యోగ యువత ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీసీపీ మహేందర్ అన్నారు. శుక్రవారం కోటి లింగాల దేవాలయం ఆవరణలో సీసీ కెమెరాల శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. శిక్షణ పొందిన యువత ఉపాధి అవకాశాలు దక్కించుకుంటూ ముందుకు సాగాలన్నారు.

మాయమాటలతో..

గజ్వేల్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల పరిధిలోని అహ్మదీపూర్ నుంచి రిమ్మనగూడ వరకు హాథ్ సే హాథ్ జోడో యాత్రను శుక్రవారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జశ్వంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

మృతుడి కుటుంబానికి..

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన ఎల్లగౌని అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రముఖ వ్యాపార వేత్త పసులకాడి రమేశ్ శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదు, బియ్యం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **బాల్యమిత్రుల చేయూత**

అక్కన్నపేట(హుస్నాబాద్): కష్టంలో ఉన్న మిత్రుడికి బాల్యమిత్రులు చేయూత అందించారు. అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన సంజీవ్ తల్లి కనకవ్వ మృతి చెందింది. బాల్యమిత్రులు రూ.31 వేలు అందజేశారు.

◆ **ఎంపీ ఫ్లెక్సీకి పాలాభిషేకం**

తొగుట(దుబ్బాక): మండలంలోని వర్దరాజుపల్లి సర్పంచ్ చత్రి రాజవ్వ ఆధ్వర్యంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫ్లెక్సీకి శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. రెడ్డి సాముహిక భవన నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేశారు.

◆ **గంగమ్మ తల్లికి హారతులు**

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులోని గంగమ్మ ఆలయ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి హారతుల కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు.

◆ **జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి**

గజ్వేల్‌రూరల్: గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని, వారికి సకాలంలో వేతనాలు చెల్లించి అండగా నిలవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి శివకుమార్, గజ్వేల్ మండల బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మన్నె శేఖర్ డిమాండ్ చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శుక్రవారం గజ్వేల్ పట్టణంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

◆ **వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

కొండపాక(గజ్వేల్): కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27వ తేదీన సీపీఎం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడారు. కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఎం తలపెట్టిన జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

◆ **అంధత్వ నివారణకు కృషి**

ఎంపీపీ ర్యాగల్ల సుగుణ

కొండపాక(గజ్వేల్): అంధత్వ నివారణ సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ ర్యాగల్ల సుగుణ పేర్కొన్నారు. మండల పరిధిలోని గిరాయిపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ కాసపురం సంజీవరెడ్డితో కలిసి కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జీల మల్లేశం, రైతు బంధు సమితీ మండల కోఆర్డినేటర్ దుర్గయ్య, గ్రామ కోఆర్డినేటర్ నర్సింహ్మారెడ్డి,బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షులు తాళ్ళపల్లి వెంకటస్వామి, వార్డు సభ్యులు మల్లేశం,రమ,నాయకులు మేకల నారాయణ,పంచాయితీ కార్యదర్శి యాదగిరి,ఏఎన్ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ **తైబజార్ వేలం**

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రం వర్గల్ గ్రామపంచాయతీకి తైబజార్ వేలం పాట ద్వారా రూ.3,01,000 ఆదాయం సమకూరింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి కార్యాలయం వద్ద శుక్రవారం బహిరంగవేలం పాట నిర్వహించారు. వర్గల్‌కు చెందిన కుమార్ హెచ్చుపాటతో తైబజార్ హక్కులు దక్కించుకున్నట్లు సర్పంచ్ గోపాల్‌రెడ్డి తెలిపారు. నిరుడు తైబజార్ వేలం ద్వారా రూ.2,85,000 ఆదాయం లభించగా, ఈ సారి అదనంగా మరో రూ.16 వేలు సమకూరిందన్నారు.

◆ **ప్లాస్టిక్ నిర్మూలనకు స్టీల్ బ్యాంక్**

నంగునూరు(సిద్దిపేట): ప్రజలకు ప్రాణాంతకంగా మారిన ప్లాస్టిక్ నిర్మూలన కోసం స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నామని ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రూ.75 వేల ఆర్థిక సహాయంతో శుక్రవారం రాజగోపాల్‌పేటలో స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి తదితులు పాల్గొన్నారు.

◆ **సద్వినియోగం చేసుకోవాలి**

దుబ్బాకరూరల్: మండలంలోని హసన్‌మీరాపూర్ గ్రామంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఎంపిడిఓ భాస్కరశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ **వడ్డీ డబ్బులు మంజూరు**

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామ సమాఖ్య గ్రూపులకు వడ్డీ డబ్బులు మంజూరు చేసిందని ఏఎంసీ చైర్మన్ సారయ్య, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాజగోపాల్‌పేటలో 52 గ్రూపులకు వడ్డి డబ్బుల ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. సమాఖ్య సభ్యులు మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

◆ **నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు**

దుబ్బాక: నకిలీ ఎరువులను రైతులకు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి గోవింద రాజు హెచ్చరించారు. శుక్రవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అధికారికంగా ధృవీకరించిన పురుగుల మందులను మాత్రమే యజమానులు విక్రయించాలని సూచించారు.

◆ **జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలి**

బెజ్జంకి(సిద్దిపేట): సీపీఎం జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బెజ్జంకిలో శుక్రవారం జన చైతన్య యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 26వ తేదీన మండలంలోని దేవక్కపల్లెకు యాత్ర చేరుకుంటుందన్నారు.

◆ **ఎస్టీ జాబితాలో చేర్చాలి**

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలను బీసీ జాబితా నుంచి ఎస్టీ జాబితాలోకి మార్చాలని జిల్లా వడ్డెర సంఘం నాయకులు కృష్ణ, శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ వడ్డెర సంఘం జెండాను వారు ఆవిష్కరించారు.

◆ **సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం**

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వం పేస్కేల్ విడుదలకు జీవో నంబరు 11 విడుదల చేసినందుకు సెర్ప్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన కొండపాక ఐకేపీ కార్యాలయం వద్ద ఐకేపీ మండల ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫెక్సీకి పాలాభిషేకం చేశారు.

◆ **పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్**

దుబ్బాకటౌన్: సీఎంఆర్‌ఎఫ్ పథకం పేద కుటుంబాలకు కొండంత అండగా ఉందని దుబ్బాక మున్సిపల్ 14 వ వార్డు కౌన్సిలర్ ఆస యాదగిరి అన్నారు. శుక్రవారం వార్డుకు చెందిన గన్నె సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వం విడుదల చేసిన రూ.40 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు.

◆ **వైభవంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. మాజీ ఆలయ చైర్మన్ బొబ్బల వజ్రవ్వ ఆదిరెడ్డి ఇచ్చిన రూ.3 లక్షల విరాళంతో ఆలయ నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నోమోల కొండల్ పద్మరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.